🌐 : www.aknu.edu.in
✉ : nannayavani@aknu.edu.in
▶ : nannayanewstv
f : Adikavi Nannaya University
✆ : 9701293231

చాళుక్య ద్వారము
ADIKAVI NANNAYA UNIVERSITY
For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్
Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య కొప్పిరెడ్డి పద్మరాజు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య గోడి సుధాకర్
కులసచివులు

సంపాదకులు
డా. తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 4 | సంచిక : 22 | 26-02-2024 | పుటలు : 4

## నన్నయ వర్సిటీకి రూ.20 కోట్లు పీఎం-ఉష నిధులు

### నన్నయ చరిత్రలో తొలిసారిగా ఉష నిధులు - వీసీ పద్మరాజును అభినందించిన ఎంపీ భరత్



ఆదికవి నన్నయ యూనివర్శిటీకి మౌళిక సదుపాయాలను పటిష్టం చేయడంలో భాగంగా 'ప్రధాన మంత్రి ఉచ్ఛతర్ శిక్షా అభియాన్ (PM-USHA)' పథకంలో రూ. 20 కోట్లు మంజూరు చేసినట్లు వీసీ ఆచార్య కె.పద్మరాజు తెలియజేశారు. మంగళవారం ఆదికవి నన్నయ యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో పీఎం ఉష బడ్జెట్ ప్రకటన ప్రారంభోత్సవాన్ని ఆన్లైన్ లో వీక్షించేందుకు ఏర్పాట్లు చేశారు. అలాగే నన్నయ యూనివర్సిటీకి మంజూరైన రూ.20 కోట్లు కు సంబంధించిన వివరాలను వీసీ తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వీసీ ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో చాలా యూనివర్సిటీలు పీఎం ఉష నిధులకు ప్రయత్నించగా ఆదికవి నన్నయ యూనివర్సిటీకి ప్రధాన మంత్రి ఉచ్ఛతర్ శిక్షా అభియాన్ (PM-USHA)' పథకంలో 20 కోట్లు మంజూరు కావడం హర్షనీయమని అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ చరిత్రలో తొలిసారిగా పెద్ద మొత్తంలో నిధులు మంజూరు కావడం ఆనందంగా ఉందన్నారు. నేడు విశ్వవిద్యాలయాలకు పీఎం - ఉష ఆధ్వర్యంలో 78 ప్రాజెక్టులకు రూ.3600 కోట్లకు పైగా బడ్జెట్‌ను ప్రధాని నరేంద్ర మోడీ జమ్మూ కాశ్మీర్ నుంచి ప్రకటించారని తెలిపారు. విశ్వవిద్యాలయాల అభివృద్ధి, మౌళిక సదుపాయాల కల్పనకు ఉపయోగపడే విధంగా పీఎం ఉష పథకంలో నుండి రూ.20 కోట్లు నన్నయ విశ్వవిద్యాలయానికి మంజూరు అయ్యాయని ఆనందాన్ని వ్యక్తం చేసారు. రూ.10 కోట్లతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ లెర్నింగ్ అండ్ రీసెర్చ్ కొరకు మల్టీపర్పస్ బిల్డింగ్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసామన్నారు. మిగిలిన రూ.10 కోట్లతో ఇప్పటికే ఉన్న మౌలిక సదుపాయాలు తరగతి గదులు, హాస్టళ్ళు పునరుద్ధరిస్తామని, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, జియో ఇన్ఫర్మేటిక్స్, ఆక్వా కల్చర్ వంటి కోర్సుల ప్రయోగశాలలకు ఖర్చు చేస్తామని, డిజిటల్ రిసోర్స్ సెంటర్‌ను స్థాపించడానికి, ఆన్‌లైన్ లెయర్, టీచింగ్, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్, విద్యార్థులకు ఉపాధి కల్పించడానికి, అల్యూమిని కనెక్ట్ పోర్టల్ వంటివి ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు రూపొందించామన్నారు. నిధుల మంజూరులో భాగస్వామ్యమైన అందరికీ అభినందనలు తెలియజేస్తూ, నిధులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేస్తామని తెలియజేసారు. త్వరలో ఇంటర్ డిసిప్లినరీ మరియు మల్టీడిసిప్లినరీలో పరిశోధన కోసం రిసోర్స్ సదుపాయం-అధునాతన అభ్యాసానికి మరియు కొత్త పరిశోధన నైపుణ్యాలకు బహిర్గతం అవుతాయన్నారు. భోధనా సౌకర్యాల పునరుద్ధరణ మెరుగైన బోధన మరియు అభ్యాస ప్రమాణాలకు దారితీస్తుందన్నారు. ఎంపీ మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక విశ్వవిద్యాలయాలు పీఎం ఉష నిధులకు పోటీపడిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి నిధులు మంజూరు కావడంలో గొప్ప విషయమని, దీనికి కృషి చేసిన వీసీ ఆచార్య కె.పద్మరాజు ను అభినందించారు. ఇప్పటికే విశ్వవిద్యాలయంలో ఖేలో ఇండియా నుండి రూ.8 కోట్లకు పైగా నిధులతో ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని గుర్తు చేశారు. నిధుల మంజూరుకు కృషి చేసిన వీసీ పద్మరాజు ను శాలువాతో సన్మానించి అభినందించారు. అలాగే విశ్వవిద్యాలయ అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతున్న ఎంపీ మార్గాని భరత్ ను వీసీ సన్మానించి అభినందించారు.







ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల అసోసియేషన్ నాయకులు, ఈసీ మెంబర్స్, ఆయా కళాశాలల అధ్యాపకులు వీసీ పద్మరాజుకు అభినందనలు తెలియజేసారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సాధించిన ప్రగతి విశేషాలను తెలియజేసారు. విశ్వవిద్యాలయ అభివృద్ధిలో వీసీ పద్మరాజు ప్రణాళికలను నిబద్ధతను ప్రశంసించారు. ప్రధాన మంత్రి ఉచ్ఛతర్ శిక్షా అభియాన్ (PM-USHA)' పథకం యొక్క లక్ష్యాలను, కార్యక్రమాలను హానరరీ ప్రొఫెసర్ కె.వి.రావు, డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య పి.సురేష్ వర్మ వివరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఈసీ మెంబర్ గంధం నారాయణరావు, రాజమహేంద్రి కాలేజ్ టీ.కె. విశ్వేశ్వరరెడ్డి, ఆదిత్య కాలేజ్ డా.సుగుణ, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, అనుబంధ కళాశాలల యాజమాన్య ప్రతినిధులు, అనూరా అలోమ్ని అసోసియేషన్ నాయకులు, ఆయా కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## భారత్-నేపాల్ సమ్మిట్‌కు హాజరైన వీసీ పద్మరాజు

### విదేశీ విద్యార్థులను ఆకర్షించిన నన్నయ యూనివర్సిటీ స్టాల్



నేపాల్‌లోని ఖాట్మండు యూనివర్సిటీలో ఫిబ్రవరి 15 నుండి 17 వరకు "గ్లోబలైజేషన్ అండ్ ఇంటర్నేషనల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ ది భారత్-నేపాల్ హయ్యర్ ఎడ్యుకేషన్ సమ్మిట్" పేరుతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఏఐయు నార్త్ జోన్ వైస్ ఛాన్సలర్ల సమావేశానికి వీసీ ఆచార్య కె. పద్మరాజు హాజరయ్యారు. ఈ ఇంటర్నేషనల్ సమ్మిట్ లో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ స్టాల్ ను ఏర్పాటు చేశారు. విదేశీ విద్యార్థులను ఆకర్షించే విధంగా ఏర్పాటు చేసిన నన్నయ యూనివర్సిటీ స్టాల్ కు విశేష స్పందన వచ్చింది. సమ్మిట్‌ను నేపాల్ ప్రధానమంత్రి ప్రారంభించారు. విద్యావేత్తలు విద్యార్థులతో పాటు రెండు దేశాల నుండి ప్రముఖులు హాజరయ్యారు. ఏఐయు యొక్క సభ్య విశ్వవిద్యాలయాలు నేపాల్ మరియు ఇతర ఆసియా దేశాల విద్యార్థులను ఆకర్షించడంలో సహాయపడటం కొరకు సమ్మిట్ ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం నేపాల్ నుండి వచ్చిన విద్యార్థులు భారతదేశంలోని మొత్తం అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్యలో 24 శాతం ఉన్నారు. ఈ సమ్మిట్ ద్వారా విదేశీ విద్యార్థులను నన్నయ విశ్వవిద్యాలయంలో వివిధ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించేందుకు ఆహ్వానించే విధంగా విశ్వవిద్యాలయ వివరాలను తెలియజేస్తూ స్టాల్ ను ఏర్పాటు చేసారు. నేపాల్ సమిట్లు ఏర్పాటు చేసిన నన్నయ యూనివర్సిటీ స్టాల్ కు మంచి స్పందన వచ్చిందని వీసీ ఆచార్య కె. పద్మరాజు ఆనందాన్ని వ్యక్తం చేశారు. విదేశీ విద్యార్థులు నన్నయ విశ్వవిద్యాలయంలో చేరడం ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, విశ్వవిద్యాలయం

















# సంపాదకీయం




## శాస్త్ర విజ్ఞానం

మానవుడు ముఖ్యంగా ఆలోచనపరుడు.ఏది మంచి, ఏది సత్యం, ఏది సరైనది,కానిది అతనికి తెలుసు.ఒక ప్రక్క శాస్త్రం. మరో ప్రక్క ప్రకృతి రెండూ అతనికి సరిగ్గా, శాస్త్రీయంగా ఆలోచించే శక్తీ, శిక్షణనిచ్చాయి. ప్రకృతిలోనే కార్యకారణత పనిచేస్తుంది.భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ తిరుగుతుందని అందువలన రాత్రీ పగలు ఏర్పడ్డాయని ప్రకృతిని పరిశీలించి తెలుసుకున్నాడు. ఇలాంటి ప్రకృతి నియమాలే శాస్త్రీయ పద్ధతిని నేర్పించాయి. శాస్త్రీయ విజ్ఞానం పెరిగేకొద్దీ ఆలోచన పెరిగింది. గుక్క త్రిప్పుకోలేనిది మానవ ప్రగతి. నిరంతర జ్ఞానాన్వేషణే మనిషి కర్తవ్యమైంది. ఇంక సాధించలేనిదేముంది. మనిషి దీక్ష వహించి నిరంతరం ఎన్నో సాధిస్తూనే ఉన్నాడు.

మానవ జీవన విధానాన్ని సైన్స్ ఎంతగా మార్చిందో దాని సహాయంతో మనిషి ఎంత అభివృద్ధి చెందాడో వైజ్ఞానిక ఆవిష్కరణలే తెలియజేస్తున్నాయి. అగాధంలో నిలిచి ఆకాశాన్ని ఆక్రమించే అవకాశం కోసం చూస్తూ ఉంటాడు మానవుడు. ఎంత విచిత్రమైన ఆశ.

మానవుడు ఎన్నో ఆవిష్కరణలు చేసి ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక శాస్త్ర యుగాన్ని ఆవిర్భవింపజేశాడు. దీనితో పరమాణుశాస్త్రం, రోదసీయానం, మొదలైన విశేషాలతో అపూర్వమైన ఆధునిక యుగం ఆవిర్భవించింది. ఒక్క మాటలో చెప్పాలంటే ఆధునిక ప్రపంచ నిర్మాత... విజ్ఞాన శాస్త్రం!

హృదయ భవనంలో నుంచి వచ్చే ఆలోచనల్ని సాకారం చేస్తూ అద్భుతమైన పిడికిలితో మానవుడు భౌతిక,రసాయన శాస్త్రాలు,గణితం, ఖగోళ,జీవ, మనోవిజ్ఞాన శాస్త్రాల్లో సాధించిన ఘనవిజయాలు మానవ వికాస గతిలో గొప్ప అధ్యాయాన్ని సృష్టించాయి. అంధ విశ్వాసాలు, దురభిప్రాయాలు, పక్షపాత ధోరణి మొదలైన వాటిపై స్వేచ్ఛగా విమర్శన చేసే ధోరణి గెలుపు పొందటమే విజ్ఞాన శాస్త్రం యొక్క చరిత్ర అయింది.విశేషమైన ఈ ప్రయత్నం కాల్పనిక భౌతిక రంగాల్లో గొప్ప ఫలితాలను సాధించి పెట్టింది. పుష్కలమైన ఆవిష్కరణలతో మనం నివసిస్తున్న ప్రపంచ స్వరూపమే మారిపోయింది.

సైన్స్ అనేది ఒక అద్దం.ఆ అద్దంలో మనం అద్భుత దృశ్యాలని చూస్తున్నాం అంటారు సైంటిస్టులు. మానవుని నిరంతర శ్రమ, ప్రకృతి మీద ఆధిపత్యం సంపాదించటానికి పడిన తపన, తన జీవనాన్ని సుఖవంతం చేసుకోవాలన్న తాపత్రయం విజ్ఞాన శాస్త్ర అభివృద్ధికి బాటలు వేసింది. అగ్ని నుంచి అణుశక్తి వరకు, చక్రం నుంచి చంద్రమండలం వరకు, పాలపుంత నుంచి జీవకణపు అంతర్చిత్రం ఆవిష్కరణ వరకు ఎన్ని మలుపులో! వాటి వెనుక మానవుడు మేధోపరంగా పడిన కఠోర పరిశ్రమ ఎంతో! అనాటి నుంచి ఈనాటి వరకు మానవునికి ప్రపంచమొక పద్మవ్యూహం. విజ్ఞానమొక తీరని దాహం.

ప్రతిరోజు ప్రపంచంలో ఎక్కడో ఒకచోట నూతన ఆవిష్కరణలు వెలువడుతూనే ఉన్నాయి. నేటి శాస్త్ర విజ్ఞాన బహుళ అంతస్థుల దివ్య సౌధానికి ప్రాచీన కాలంలోనే పటిష్టమైన పునాదులు ఏర్పడ్డాయి. ప్రాచీనుల అన్వేషణ బాటలో ప్రకృతి అంశాలపై తలెత్తిన ప్రశ్నలకు సమాధానాలు రాబట్టే క్రమంలో విజ్ఞాన శాస్త్రం శాఖోపశాఖలుగా విస్తరించింది. వర్ధిల్లుతుంది.

ఏ విజ్ఞాన శాస్త్ర ఆవిష్కరణ అయినా సమాజాభివృద్ధి కోసమే. ప్రతి ఆవిష్కరణ మానవ జీవితాన్ని మరింత మెరుగుపరుచుకోవడం కోసమే. సామాజిక హితమైన శాస్త్ర విజ్ఞాన లక్ష్యం ఒక మతం కోసమో, జాతి కోసమో విజ్ఞాన శాస్త్ర ఆవిష్కరణలు జరగలేదు. మానవ ప్రశాంత జీవనానికి ఆవిష్కరణలు తోడుపడేవిగా ఉంటూ ధర్మ మార్గంలో నడవడం జరిగితేనే ప్రపంచ శాంతి లభిస్తుంది. జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవ సందర్భంలో... ఆకాశంలో, సముద్రంలో నీలిరంగుకు కారణాలు, నక్షత్రాల విశేషాలు తన పరిశోధనలతో శాస్త్రీయంగా నిరూపించి **1930** ఫిబ్రవరి **28**న రామన్ ఎఫెక్ట్ ద్వారా తెలిపిన సర్ సి.వి.రామన్ ని తలుచుకుంటూ విజ్ఞాన శాస్త్ర అన్వేషణలు విశ్వశ్రేయస్సుకు ఉపయోగపడాలని, లోక కళ్యాణానికి ఆధారం కావాలని ఆశిద్దాం!!

## కాకినాడ క్యాంపస్‌లో మల్లాడి సత్యలింగం నాయకర్ వర్ధంతి



ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్ కాకినాడ నందు క్యాంపస్ స్థలదాత కాకినాడ ప్రజానీకానికి విద్యారంగ అభివృద్ధి కోసం పాటుపడిన మహాదాత శ్రీ మల్లాడి సత్యలింగం నాయకర్ 109వ వర్ధంతిని పురస్కరించుకొని క్యాంపస్ లో గల నాయకర్ విగ్రహానికి పూలమాలతో నివాళిని అర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా క్యాంపస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్. ప్రశాంతిశ్రీ మాట్లాడుతూ అతి పేద కుటుంబంలో పుట్టిన శ్రీ మల్లాడి సత్య లింగ నాయకర్ చిన్న వయసులో విద్యను అభ్యసించలేక అనేక ఆర్థిక సమస్యలతో బాధపడుతూ జీవితంలో ఏదైనా సాధించాలి అనే లక్ష్యంతో అప్పటి బర్మా దేశానికి ఒక కూలి రూపంలో నౌకా నిర్మాణ రంగంలో చేరి అంచలంచెలుగా తన యొక్క నైపుణ్యాన్ని మెరుగుపరచుకుంటూ నౌక నిర్మాణంలో తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకుని బాగా సంపదను అర్జించి తిరిగి స్వదేశానికి వచ్చి తనలాగా నిరక్షరాస్యతతో ఎవరూ బాధపడకూడదని తన సంపాదన కాకినాడలోగల వేలఎకరాల ఆస్తులను విద్యాభివృద్ధికి ఇచ్చిన మహాదాత శ్రీ మల్లాడి సత్యలింగ నాయకర్ అని కొనియాడారు. అటువంటి నాయకర్ ను స్ఫూర్తిగా తీసుకొని మనతో ఉన్న మన సమాజాన్ని అభివృద్ధి పథంలో నడిపించే బాధ్యత విద్యార్థులుగా మీ పై ఉందని తెలియజేశారు . ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి డా.హరిబాబు అధ్యాపకులు డా. అజయ్ రతన్, డా జోసఫ్ స్టీఫెన్, డా.హారిక , మహమ్మద్ నదీమ్, మనోజ్ దేవ, డా.విజయశ్రీ, శ్రీమతి రాధామాధవి, డా.ఉమా రజిత, శ్రీనివాస్ తదితర అధ్యాపకులు బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొని పూలమాలలతో మహాదాత శ్రీ మల్లాడి సత్యలింగ నాయకర్ గారి విగ్రహానికి నివాళులర్పించారు.

## గూడెం క్యాంపస్‌లో లయన్స్ క్లబ్ సేవలు




ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు వార్షిక అధికారిక సందర్శనకు ఇటీవల ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఆతిథ్యం ఇచ్చింది.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ తాడేపల్లిగూడెం రీజియన్ సభ్యులు యూనివర్శిటీ ఆవరణలోని మహిళా హాస్టల్లో సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.అశోక్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలలో విద్యార్థుల భాగస్వామ్యం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న లయన్స్ క్లబ్ సభ్యులు తాము చేపట్టిన పలు సామాజిక కార్యక్రమాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## దేశ అభివృద్ధిలో యువత పాత్ర 'వికసిత్ భారత్ @ 2047'



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎద్యుకేషన్ కాలేజ్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా ఉండడంలో యువత పాత్ర అనే అంశంపై విశ్వవిద్యాలయ స్థాయిలో వక్తృత్వ పోటీ నిర్వహించడం జరిగింది. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ పరిధిలో గల వివిధ ఎన్ఎస్ఎస్ యూనిట్ల నుండి సుమారు 52 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు దీనిలో పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ కనబరిచిన పది మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ప్రోగ్రాం కన్వీనర్, ఎన్ఎస్ఎస్ పిఓ డా. ఎం.గోపాలకృష్ణ వికసిత్ భారత్ ప్రోగ్రాంకు సహకరిస్తున్న వీసీ ఆచార్య కె పద్మరాజు, రిజిస్ట్రార్ ఆచార్య జి సుధాకర్, ప్రిన్సిపల్ ఆచార్య కె.సుబ్బారావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య వై. శ్రీనివాసరావు, వక్తృత్వ పోటీల న్యాయ నిర్ణేతలు డా.పి. లక్ష్మీనారాయణ, డా.జే.సూరయ్య, డా. ఎస్.రాజ్యలక్ష్మి లకు కృతజ్ఞతలు తెలిపారు.



## చైల్డ్ సైకాలజీ పీజీ డిప్లమో విద్యార్థుల ఆత్మీయ సమావేశం



ఎమ్మెస్సీ సైకాలజీ విభాగం అందిస్తున్న ఏడాది చైల్డ్ సైకాలజీ డిప్లమో కోర్స్ మొదటి బ్యాచ్ విద్యార్థుల వీడ్కోలు, రెండవ బ్యాచ్ విద్యార్థుల స్వాగత సమావేశం కౌన్సిలింగ్ సెంటర్ ప్రక్కనగల వినూత్న ఓపెన్ క్లాస్ నందు జరిగింది. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. విజయనిర్మల విద్యార్థులకు శుభాకాంక్షలు అందించారు తెలిపారు.సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులతో తమ డిప్లమో కోర్స్ అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో స్పృహ సైకాలజీ తరఫున గాదె కిశోర్, సుంకర నాగేంద్ర కిశోర్ స్పృహ సైకాలజీ అలుమ్నిలోనికి విద్యార్థులకు స్వాగతం పలికారు. సీనియర్ విద్యార్థులకు స్పృహ అలుమ్ని తరఫున జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సైకాలజీ విభాగం కోర్స్ కోఆర్డినేటర్ డా.నారాయణ నక్కిన, సహాయాచార్యులు డా. రాజశేఖర్ పడాల, డా.ఎన్.సిహెచ్. కె.భవాని పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు అందించారు.





# PM USHA - నిధుల విడుదల సందర్భంగా

# వీసికి అభినందనల చిత్ర మాలిక















ప్రేమ్ చంద్ -ఇరిగేషన్ డిపార్ట్మెంట్ -పోలవరం




పి. కోమల్ కుమార్ (పోస్టల్ సూపరింటెండెంట్)
అప్పారావు (యూనివర్సిటీ క్యాంపస్ పోస్ట్ మాస్టర్)

## నన్నయ భారతికి గ్రంథ బహూకరణ



విశ్వవిద్యాలయంలోని బిఆర్ అంబేద్కర్ కేంద్ర గ్రంథాలయంలో దాతలు సమర్పించిన పుస్తక భాండాగారం నన్నయ భారతికి సుమారుగా 500 తెలుగు సంస్కృత సాహిత్య గ్రంథాలను వాటిని భద్రపరచడానికి ఒక ఐరన్ షెల్ఫ్ ను ప్రముఖ సాహితీవేత్త శతావధాని డా.కేశాప్రగడ సత్యనారాయణ గారి కుమారులు శ్రీరామచంద్రమూర్తి నన్నయ భారతి కోఆర్డినేటర్ డా.తలారి వాసు కి అందజేశారు.ఇందులో సంస్కృత కవుల కావ్యాలు వాటి వ్యాఖ్యానాలు ఉన్నాయని, యోగ వాశిష్టము నాలుగు భాగాలు, సూర్యరాయాంధ్ర నిఘంటువులు ఎనిమిది భాగాలు వంటి అపురూపమైన,అరుదైన గ్రంథాలు నేటి తరం విద్యార్థులకు పరిచయం అవుతాయని పరిశోధక విద్యార్థులకు,తెలుగు అధ్యయనం చేసే విద్యార్థులకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని కేంద్ర గ్రంథాలయ సమన్వయకర్త డా. పి.విజయనిర్మల అన్నారు. గ్రంథాలయాధికారి డా.టి. సింహాచలం పుస్తక దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు.విలువైన అరుదైన గ్రంథాలను వనరులను నన్నయ భారతికి సమకూరుస్తున్న దాతలకు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ ధన్యవాదాలు తెలియజేశారు.

## మంచిమాట



# జాతీయ సైన్స్ దినోత్సవం

## సర్ సి.వి రామన్



సముద్రం నీలిరంగులో ఎందుకు ఉంటుంది? ఆకాశం నీలంరంగులో ఉండడానికి కారణం ఏమిటి? పగటిపూట మనకు నక్షత్రాలు ఎందుకు కనపడవు? ఇలాంటి ప్రశ్నలకు సర్ సి.వి.రామన్ తన పరిశోధనలతో శాస్త్రీయంగా నిరూపించి 'రామన్ ఎఫెక్ట్' కనిపెట్టిన ఫిబ్రవరి 28న మనం జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుకుంటున్నాం. తమిళనాడులోని తిరుచినాపల్లిలో 1888 నవంబర్ 7న చంద్రశేఖర్ అయ్యార్, పార్వతి అమ్మల్ దంపతులకు చంద్రశేఖర్ వెంకటరామన్ జన్మించారు. ఈయన తండ్రి ఏబీఎన్ కళాశాలలో లెక్చరర్ గా పనిచేయడం వల్ల రామన్ బాల్యం,విద్యాభ్యాసం అంత విశాఖపట్నంలోనే జరిగింది. బాల్యం నుంచి రామన్ కి పుస్తకాలు చదవడం, ప్రయోగాలు చేయడమంటే అమితాశక్తి.ఇంట్లో దొరికే చిన్నచిన్న పరికరాలతో ఏవేవో ప్రయోగాలు చేసేవారు.ఓసారి చిన్నప్పుడు తీగను ఉపయోగించి విద్యుత్ డైనమో చేయగలిగాడు.

**చదువులో స్కాలర్షిప్లు,**

బహుమానాలు అందుకొని 11 ఏళ్లకే ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించి,14 ఏళ్లకే బి.ఎ ఇంగ్లీష్ ,ఫిజిక్స్ లో గోల్డ్ మెడల్ సాధించారు. తర్వాత ఎంఏ ఫిజిక్స్ లో చేరి సోనోమీటర్,కటకాలు, పట్టకాలుతో సొంతంగా ప్రయోగాలు చేసి కొత్త విషయాలు తెలుసుకునేవాడు. కేవలం 17 ఏళ్లకే కాంతికి సంబంధించి తాను పరిశోధించిన ప్రయోగాలతో లండన్ లోని ఓ సైన్స్ పత్రిక అయిన 'ఫిలసాఫికల్ మ్యాగజైన్' కు పరిశోధన పత్రాన్ని పంపించారు.అది చదివిన ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త లార్డ్ ర్యాలీ అతనిని లండన్ కు పరిశోధనలకు రమ్మని ఆహ్వానిస్తూ ఈ బాలుని వయసు తెలియక ప్రొఫెసర్ అని సంబోధించారు.

ఆ తర్వాత మనదేశంలో పరిశోధనలకు సదుపాయాలు లేకపోవడంతో 'ఇండియన్ ఫైనాన్షియల్ సివిల్ సర్వీసెస్' నిర్వహించే పోటీ పరీక్షల్లో దేశంలోనే మొదటి వ్యక్తిగా నిలిచి కోల్కతాలో డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ గా విధుల్లో చేరారు. అప్పటికి రామన్ వయసు కేవలం 19 ఏళ్ళే. ఆ రోజుల్లో రూ.1100 జీతాన్ని ఇచ్చే హోదా గల బ్రిటిష్ ఉద్యోగాన్ని వదులుకొని సైన్స్ ప్రయోగాలపై మక్కువతో కేవలం రూ.600 జీతం వచ్చే ప్రొఫెసర్ గా చేరారు. 1921 సం.లో తాను అధ్యయనం చేసిన సంగీత పరికరాల శబ్దరహస్యంపై లండన్ లో ఉపన్యాసాలు ఇచ్చారు. కేవలం ఇటువంటి అంశాలతో రాయల్ సొసైటీ సభ్యుడు కావాలనుకుంటున్నావా అని ఓ వ్యక్తి చేసిన వెటకారంతో ఆయనలో పట్టుదల మరింత పెరిగింది. తర్వాత సముద్రం నీరు నీలి రంగులో ఎందుకు ఉంటుంది? అనే అంశంపై రామన్ చేసిన ప్రయోగం ఓ సంచలనం.ఈ అంశం అనేక అద్భుతాలకు వేదికగా నిలిచింది.లండన్ నుంచి తిరుగు ప్రయాణంలో ఓడలో వస్తున్నప్పుడు ఆకాశం, సముద్రం నీరు రెండింటికి నీలిరంగు ఉండడం ఆయన్ని ఆలోచింపజేసింది. ఆకాశం నీలిరంగులో ఉంటుంది కాబట్టి సముద్రం నీరు నీలిరంగులో ఎందుకు ఉంటుంది? అనే విషయాన్ని నిరూపించాలనుకున్నారు. సముద్రజలంలోని అణువులు సూర్యకాంతిని వివిధ వర్ణాలుగా వివిధ దశల్లో వెదజల్లుతాయి. నీలిరంగు కిరణాలు మాత్రం ఎక్కువ లోతుకు చొచ్చుకుపోయి ప్రతిఫలిస్తాయి.అందువల్ల సముద్రం నీలిరంగులో ఉంటుందని రామన్ నిరూపించారు.ఇందులో భాగంగా చేసిన 'రామన్ ఎఫెక్ట్' కి 1930లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందారు. ఈ అవార్డు పొందిన మొదటి భారతీయునిగా,మొదటి ఆసియా ఖండ వ్యక్తిగా రామన్ నిలిచారు.

అదునాతనమైన పరికరాలు లేకపోయినా తన ఆలోచనకు తన ప్రయోగాలతోనే జవాబు ఇచ్చారు.సూర్యుడి నుంచి వెలువడే తెలుపురంగు కాంతి వాయువు అణువులపై పడితే ఆ అణువులు తన ప్రయాణ దిశను మార్చుకుంటాయని తన పరిశోధనల ద్వారా నిరూపించారు.దీని ద్వారా వస్తువుపై కాంతికిరణం పడితే అవి పరావర్తనం చెందుతాయని 1930 ఫిబ్రవరి 28న తన రామన్ ఎఫెక్ట్ ద్వారా నిరూపించిన సందర్భంగా ఫిబ్రవరి 28 ను 'జాతీయ సైన్స్ దినోత్సవం' గా జరుపుకుంటున్నాము.

కేవలం 200 రూపాయలు కూడా ఖర్చు చేయని పరికరాలతో ఈ విషయ నిరూపణ జరగడం అద్భుతమని ప్రపంచ శాస్త్రవేత్తలంతా రామన్ ను అభినందించారు.

ఎంతో ప్రతిభాసాలిగా గుర్తింపు పొందిన రామన్ కు 1924 లో 'ఇంగ్లాండ్ రాయల్ సొసైటీ సభ్యత్వం', 1928లో 'సర్' బిరుదు, 1929లో 'నైట్ హుడ్'అవార్డు,1930లో 'నోబెల్ బహుమతి', 1947లో 'ఫ్రాంక్లిన్ మెడల్',1954లో 'భారతరత్న',1957లో 'లెనిన్ అవార్డు' వంటి ఎన్నో బహుమానాలు,సత్కారాలు దేశ విదేశాల్లో అందుకోవడం జరిగింది. "సైన్స్ నా మతం..దానినే జీవితాంతం ఆరాధిస్తా" అని చెప్పి తుదిశ్వాస వరకు ప్రయోగాలతోనే గడిపిన నిత్య అన్వేషకుడు సరి సి.వి.రామన్. ఎటువంటి సదుపాయాల లేని ఆ రోజుల్లో భారతదేశ ఖ్యాతిని తన ప్రయోగాల ద్వారా విదేశాలకు వ్యాపింపజేసిన సర్ సి.వి. రామన్ అడుగుజాడల్లో నేటి విద్యార్థులు, మేధావులు నడవాలని ఆకాంక్ష.

**- బి.సుశాంత్ కుమార్**

# దేశ లక్ష్యం వీక్షిత్ భారత్, సశక్త భారత్!




జాతీయ విజ్ఞాన దినోత్సవం(Naional ScienceDay) ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28 న 'రామన్ ఎఫెక్ట్' యొక్క ఆవిష్కరణ జ్ఞాపకార్థం జరుపుకుంటాం.భారతప్రభుత్వం 1986లో ఫిబ్రవరి 28ని నేషనల్ సైన్స్ డే గా ప్రకటించింది.ఈ రోజున సర్ సి.వి.రామన్ 1930లో నోబెల్ బహుమతి పొందిన 'రామన్ ఎఫెక్ట్'ను కనుగొన్నట్లు ప్రకటించారు.ఈ సందర్భంగా దేశమంతటా థీమ్ ఆధారిత సైన్స్ కమ్యూనికేషన్ కార్యకలాపాలు నిర్వహిస్తారు.థీమ్ లాంచ్ దేశవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేకంగా జాతీయ విజ్ఞాన దినోత్సవ వేడుకలను ప్రేరేపిస్తుంది.జాతీయ విజ్ఞాన దినోత్సవం 2024 యొక్క థీమ్ "వీక్షిత్ భారత్ కోసం స్వదేశీ సాంకేతికతలు".మన శాస్త్రీయ ప్రయత్నాలకు మనదేశ భవిష్యత్తును మాత్రమే కాకుండా ప్రపంచ పురోగతికి గణనీయంగా దోహదపడే శక్తి ఉందని స్పష్టంగా తెలుస్తుంది. థీమ్ ఒక కొత్త శకాన్ని సూచించడమే కాకుండా దేశీయంగా, అంతర్జాతీయంగా ప్రజా,శాస్త్రీయ సోదరభావానికి సహకరించడానికి, కలిసి పని చేయడానికి,భారతదేశం మొత్తం మానవాళి యొక్క శ్రేయస్సుకు దోహదపడే అవకాశాన్ని కూడా అందిస్తుంది. సైన్స్ ద్వారా భారతదేశాన్ని ఆత్మనిర్భర్ గా మార్చడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ, మొత్తం మానవాళికి ప్రాముఖ్యాన్నిచ్చే విషయాలను పరిష్కరించాల్సిన అవసరాన్ని ఇదినొక్కిచెబుతుంది.

విద్యా సంస్థల పాత్ర వ్యక్తిని అభివృద్ధి చేయడం,వ్యక్తి అభివృద్ధి ద్వారా మాత్రమే దేశం నిర్మించబడుతుంది. భారతదేశం నేడు ఉన్న కాలంలో, వ్యక్తిత్వ నిర్మాణ ప్రచారానికి అత్యంత ప్రాముఖ్యత ఉంది. అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్యం కోసం కృషి చేస్తూ అవిశ్రాంతంగా పని చేయడానికి మనకు 25 సంవత్సరాల అమృతకాల్ ఉంది. సమిష్టి కుటుంబ బాధ్యతగా ఈ వాతావరణాన్ని నెలకొల్పడం మనందరి బాధ్యత. సైన్స్ యొక్క పరివర్తనశక్తిని ఎక్కువ ప్రయోజనం కోసం ఉపయోగించుకోవటానికి దేశవ్యాప్తంగా శాస్త్రీయ విచారణ, సహకారాన్ని ప్రోత్సహించే పర్యావరణ వ్యవస్థను మనం సృష్టించగలం. సైన్స్,టెక్నాలజీ,ఇన్నోవేషన్లపట్ల ప్రజల ప్రశంసలను ప్రోత్సహించడం మొత్తం శ్రేయస్సు కోసం స్వదేశీ సాంకేతికతల ద్వారా సవాళ్లను పరిష్కరించడానికి భారతీయ శాస్త్రవేత్తల విజయాలను ప్రోత్సహించడంపై వ్యూహాత్మక దృష్టి పెట్టింది.

ఇటీవలి శాస్త్రీయ విజయాల నేపథ్యంలో, గత 10 సంవత్సరాలలో భారతదేశం యొక్క పెరుగుతున్న పథం ప్రపంచవ్యాప్తంగా సాక్ష్యంగా ఉందని నొక్కి చెప్పవచ్చు. మనం శాస్త్రీయ పరిశోధన ప్రచురణలలో ప్రపంచవ్యాప్తంగా మొదటి ఐదు దేశాలలో ఉన్నాము, గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్ (GII)లో 40వ స్థానంలో ఉన్నాము, 2015లో 81వ ర్యాంక్ నుండి అద్భుతమైన పెరుగుదలను ప్రదర్శించాము, అంతేకాకుండా మన పేటెంట్ ఫైలింగ్ 90,000 దాటింది. రెండు దశాబ్దాలలో ఇదే అత్యధికం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆస్ట్రానమీ, సోలార్ & విండ్ ఎనర్జీ, సెమీకండక్టర్స్, క్లైమేట్ రీసెర్చ్, స్పేస్ రీసెర్చ్ మరియు బయోటెక్నాలజీ వంటి రంగాలలో సైన్స్ మరియు టెక్నాలజీని బలోపేతం చేయడం వల్ల ఇదంతా జరిగింది. భారతీయ శాస్త్రీయ పురోగతుల ప్రయోగశాల నుండి చంద్రునికి చేరుకున్నాయిబీ చంద్రుని దక్షిణ ధ్రువంపై చంద్రయాన్-3 విజయవంతంగా ల్యాండింగ్ చేయడంతో, ఈ ఘనత సాధించిన మొదటి దేశంగా భారత్ అవతరించింది. బలమైన వ్యాక్సిన్ అభివృద్ధి సామర్థ్యంలో భారతదేశం కూడా గుర్తించబడింది. ఇది COVID మహమ్మారి సమయంలో నిరూపించబడింది. క్వాంటమ్ టెక్నాలజీలో గ్లోబల్ స్ట్రైడ్తో సరిపెట్టుకోవడానికి భారతదేశం ఇప్పుడు సిద్ధంగా ఉంది. భారతీయ వైజ్ఞానిక పురోగతుల ప్రభావం సామాన్యులకు 'ఈజ్ ఆఫ్ లివింగ్' (జీవన సౌలభ్యం) ని గణనీయంగా పెంచుతోంది.

సాంకేతికత భవిష్యత్తు-ఆధారితమైనది. తక్కువ ఉపాంత వ్యయాలు మరియు దాదాపు అనంతమైన స్కేలబిలిటీ యొక్క ఘాతాంక ప్రయోజనాన్ని భారతదేశం కలిగి ఉంది - స్వదేశీ ప్లాట్ఫారమ్లను నిర్మించడం మరియు స్వంతం చేసుకోవడం ద్వారా, భారతదేశం తన డిజిటల్ మరియు భౌతిక ప్రయోజనాలను పూర్తిగా భద్రపరుస్తుంది. భారతదేశంలోని 1.4 బిలియన్ల ప్రజల ప్రయోజనం కోసం ప్రభుత్వ మరియు ప్రైవేట్ రంగాలు రెండూ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకున్నాయి. సాంకేతికత-మొదటి వ్యూహం ద్వారా భారతీయ పౌరుల జీవితంలోని ప్రతి అంశాన్ని సురక్షితంగా ఉంచడానికి దేశం ఇప్పుడు దాని సాంకేతిక నైపుణ్యాన్ని మరియు పబ్లిక్ మరియు ప్రైవేట్ పార్టిసిపెంట్ల మధ్య ప్రత్యేకమైన పరస్పర చర్యను ఉపయోగించడం ద్వారా భారతదేశం 2047 కి అభివృద్ధి చెందిన దేశంగా తప్పకుండా చేరుకుంటుంది. "నేడు దేశ లక్ష్యం విక్షిత్ భారత్, సశక్త భారత్!. ఈ అభివృద్ధి చెందిన భారత్ కల నెరవేరే వరకు మనం ఆగలేం" జైహింద్!జై భారత్!!

**డా.ఎల్.ముత్యాలనాయుడు**
**సహాయాచార్య,బోటనీ విభాగం, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం.**